
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

ఆదివారం । 21 । జూలై । 2024



సోమశిలలో 9.767 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శనివారానికి 9.767 టీఎంసీలు ఉన్నాయి. 2 క్యూసెక్కుల వరద వస్తుంది. దిగువకు 210 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.75,700
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,780
3శాతం జీఎస్టీతో	రూ.6,983
నవర (8 గ్రా)	రూ.55,864

గరిష్టం/కనిష్టం
32.1 /25.9

వాతావరణం


జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. వాతావరణంలో తేమ 74 శాతం ఉంది.

కడలిపై మత్స్యయుద్ధం

బతుకు పోరాటంలో ఒక వైపు మత్స్యకారులు ప్రాణాలను పణంగా పెట్టి మత్స్య సంపద కోసం సాగరాన్ని మదిస్తున్నారు. మరో వైపు నడి సంద్రంలో తమిళ జాలర్ల దౌర్జన్యాలపై మనుగడ సమరం సాగిస్తున్నారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల మత్స్యకారులు, తమిళ జాలర్ల మధ్య సినిమా సీన్లను తలపించే విధంగా యుద్ధ ఘట్టాలు సాగరంలో నిత్యకృత్యంగా మారాయి. నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా చొరబడి తమిళ జాలర్లు పెద్ద పెద్ద (మెకనైజ్డ్) బోట్లతో వేటసాగించడమే కాకుండా మత్స్య సంపదను కొల్లగొడుతున్నారు. అడ్డుపడితే మారణాయుధాలతో దాడులు చేస్తూ కడలిలో భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. ఆటవిక చర్యలతో సముద్ర జలాలు రక్తసిక్తమవుతున్నాయి.

- వలలు ధ్వంసం చేసి 'మత్స్య సంపద' దోచుకెళ్తున్న తమిళ జాలర్లు
- తరచూ జరుగుతున్నా.. పట్టించుకోని అధికారులు, పాలకులు
- భీతిల్లుతున్న రెండు జిల్లాల మత్స్యకారులు

- కావలి మండలం తుమ్మలపెంట సముద్ర తీరంలో స్థానిక మత్స్యకారులకు చెందిన రూ.20 లక్షల విలువ చేసే వలలను తమిళ జాలర్లు ధ్వంసం చేశారు.
- కొంత కాలం క్రితం అల్లూరు మండలం ఇస్కపల్లి తీరంలో చేపల వేట చేస్తున్న స్థానిక మత్స్యకారుల వలలను తమిళ జాలర్లు బోట్లతో ఢీకొట్టి, వలలను నష్టపరిచారు.
- కావలి మండలం చెన్నాయపాలెం పెద్ద పట్టపుపాలెం వద్ద తీరంలో వేట చేస్తున్న తమిళ జాలర్ల బోటును, అందులో ఉన్న జాలర్లను మన మత్స్యకారులు బంధించారు. దీనిపై తమిళ బోట్ల యజమానుల సంఘం ప్రతినిధులు మన మత్స్యకారులకు నచ్చజెప్పి బోటును, తమిళ జాలర్లను విడిపించుకెళ్లారు.



కావలి మండలం చెన్నాయపాలెం పెద్ద పట్టపుపాలెం తీరంలో మత్స్యకారులు పట్టుకొన్న తమిళ జాలర్ల బోటు (ఫైల్)

కావలి: తమిళ జాలర్లు సముద్ర దోపిడీ దొంగల్లా మారారు. నెల్లూరు, ప్రకాశం జిల్లాల మత్స్యకారులు చిన్న బోట్లతో ఎగిసిపడే అలలపై ప్రాణాలు పణంగా పెట్టి మత్స్య సంపదను పోగేస్తుంటే.. మెకనైజ్డ్ బోట్లతో సమూహంలా తమిళ జాలర్లు దోచుకెళ్తున్నారు. రూ.లక్షల విలువైన వలలను ధ్వంసం చేస్తున్నారు. అడ్డుకుంటే మారణాయుధాలతో దాడులకు తెగబడుతున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో తడ నుంచి కావలి సరిహద్దు వరకు 169 కి.మీ., కావలి సరిహద్దు నుంచి ప్రకాశం జిల్లాలో చీరాల వాడరేవు వరకు 112 కి.మీ. మేర సముద్ర తీరం ఉంది. ఈ రెండు జిల్లాల పరిధిలో మత్స్యకారులకు చేపల వేట సాగించడం నిత్యం సమరంగా మారింది. చేపల కోసం వేట చేయడం ఒక ఎత్తైతే, సముద్రంలో తమిళ జాలర్ల నుంచి కాపాడుకోవడం మరో ఎత్తుగా మారింది.



సంప్రదాయ తెప్పను వేటకు సిద్ధం చేసుకుంటున్న మత్స్యకారులు

నిబంధనలు ఏమిటంటే..

చిన్న ఇంజిన్ ఉన్న బోట్లతో సముద్రంలో తీరం నుంచి 8 కి.మీ. లోపలే వేట సాగించుకోవచ్చు. ఇంకా లోపలికి వెళ్లి వేట సాగించుకోవచ్చు. ఇక ఇతర రాష్ట్రాలకు చెందిన జాలర్లు ఒడ్డు నుంచి 23 కి.మీ. అవతలి జలాల్లో మాత్రమే చేపల వేట చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు అన్ని రాష్ట్రాల మత్స్యకారులకు వర్తిస్తాయి.

తమిళనాడులో వేల సంఖ్యలో మెకనైజ్డ్ బోట్లు

ఒడ్డు నుంచి సముద్రంలో 8 కి.మీ. వరకు మెకనైజ్డ్ బోట్లతో చేపల వేట చేయకూడదనే నిబంధనలు ఉన్నాయి. తమిళనాడులో వేల సంఖ్యలో ఈ రకం బోట్లు ఉన్నాయి. ఈ బోట్లతో సముద్రంలోకి చేపల వేటకు వెళితే నెల రోజుల పాటు వేట చేయడానికి అవసరమైన సామగ్రి, ఆహారం నిల్వ చేసుకొంటారు. వీటిలో కనీసం 5 నుంచి 10 మంది వరకు మత్స్యకారులు ఉంటారు. తమిళనాడు ప్రాంతంలోని మత్స్యకారులు అధునాతన వలలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వేటలో వినియోగిస్తుంటారు. ఒకేసారి టన్నుల కొద్ది మత్స్య సంపదను పట్టగలిగే వలలు తమిళుల వద్ద ఉంటాయి. వలలకు దొరికిన భారీ సంపదను సముద్రంలోనే బోటులోకి చేర్చుకోవడం అంటే కష్టం. అందుకే వారు 'వింజ్' అనే బుల్లి పొక్లయినర్ వంటి యంత్రంతో టన్నుల కొద్ది చేపలతో నిండిన వలలను సముద్రంలో నుంచి బోటులోకి లాగడానికి వినియోగిస్తుంటారు. ఈ క్రమంలో వారి సముద్ర ప్రాంతంలో మత్స్య సంపద బాగా తగ్గిపోతోంది. దీంతో తమిళ మత్స్యకారులు ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరం వైపు వచ్చేస్తున్నారు.

తమిళ జాలర్లు నిబంధనలు ధిక్కరించి..

నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని జాలర్లకు భారీ బోట్లు లేవు. కేవలం తెప్పలు, చిన్న ఇంజిన్ కలిగిన బోట్లు మాత్రమే ఉన్నాయి. దశాబ్దాలుగా వీటితోనే నిబంధనలకు అనుగుణంగా తీరం నుంచి 8 కి.మీ. లోపు సముద్రంలో వేట సాగిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే తమిళ జాలర్లకు భారీ సామర్థ్యం కలిగిన బోట్లు ఉన్నాయి. ఈ బోట్లతో సముద్ర తీరానికి 23 కి.మీ. అవతలి నుంచి వేట సాగించుకోవాల్సి ఉంది. తమిళనాడులోని నాగూర్ నాగపట్నం, కడలూరు, కేంద్ర పాలిత ప్రాంతం పాండిచ్చేరిలోని పారైకల్ తదితర సముద్ర తీర ప్రాంతాలకు చెందిన తమిళ జాలర్లు నిబంధనలను అతిక్రమిస్తున్నారు. వీరు ఆంధ్రా సరిహద్దు జలాల్లోకి అక్రమంగా ప్రవేశించి 8 కి.మీ. లోపల భాగంలోకే వచ్చేసి దర్జాగా చేపల వేట సాగిస్తున్నారు. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం 180 హార్స్ పవర్ ఉన్న ఇంజిన్లను మాత్రమే బోట్లకు వినియోగించాలని నిబంధనలు పెట్టింది. కానీ తమిళ జాలర్లు 500 హార్స్ పవర్ ఉన్న ఇంజిన్లను చైనా నుంచి కొనుగోలు చేసి, భారీ బోట్లను తయారు చేసుకుని వాటికి సమకూర్చుతున్నారు. సాధారణంగా సముద్రంలో చేపల వేట చేసే బోట్లు గంటకు 20 కి.మీ. వేగంతో వెళ్తాయి. కానీ తమిళ జాలర్ల బోట్లు గంటకు 100 కి.మీ. స్పీడ్‌తో ప్రయాణిస్తున్నాయి. తమిళ జాలర్లు స్టీల్‌తో చేసిన భారీ బోటులో తీరానికి 8 కి.మీ. సముద్ర జలాల్లో (ఆంధ్రా సరిహద్దుల్లో) వేట సాగించడమే కాకుండా, ఆంధ్రా మత్స్యకారులు కష్టపడి పట్టుకున్న మత్స్య సంపదను దోచుకెళ్తున్నారు. వీరు చేస్తున్న దోపిడీకి ఆంధ్రా మత్స్యకారుల బోట్లను, వలలను తొక్కించుకుంటూ వెళ్లిపోతున్నారు. ఇవి ధ్వంసమైపోయి.. మత్స్యకారులు తీవ్ర రక్తగాయాలతో సముద్రంలోనే గంటల తరబడి ప్రాణాలను అర చేతిలో పెట్టుకొని ఈదుకొంటూ ఒడ్డుకు చేరుకొంటున్నారు.

నిస్సహాయ స్థితిలో నెల్లూరు, ప్రకాశం మత్స్యకారుల పరిస్థితి

తమకు జీవనోపాధి లేకుండా చేస్తున్న తమిళ జాలర్లను అరికట్టాలని, వారి దాడుల నుంచి రక్షణ కల్పించాలని ఆంధ్రా మత్స్యకారులు చాలా కాలంగా కోరుతున్నారు. ప్రకాశం జిల్లాలోని చీరాల వద్ద ఉన్న వాడరేవు నుంచి విశాఖపట్నం వరకు మత్స్యకారుల వద్ద పెద్ద బోట్లు ఉండడంతో తమిళ జాలర్లు అటుగా పోవడం లేదు. వాడరేవు నుంచి నెల్లూరు జిల్లాలోని తడ వరకు ఉన్న సముద్ర తీరంలోని మత్స్యకారుల వద్ద పెద్ద బోట్లు లేకపోవడంతో తమిళ జాలర్ల ఆగడాలు మితిమీరుతున్నాయి. కొన్ని సందర్భాల్లో మన మత్స్యకారులు ఐక్యంగా ఉండి తమిళ జాలర్ల కోసం నిఘా పెట్టి ప్రాణాలు లెక్క చేయకుండా వారిని పట్టుకొంటున్నారు. జాలర్లను బందీగా పట్టుకొని పోలీసులకు అప్పగిస్తున్నారు. ఆ సమయంలో మాత్రం శాంతిభద్రతలు అంటూ మన పోలీసులు, మత్స్యశాఖ అధికారులు రంగంలోకి దిగుతున్నారు. ఈ క్రమంలో ఒకటి.. రెండు సందర్భాల్లో తమిళనాడుకు చెందిన మత్స్యశాఖ అధికారులు జిల్లాకు రావడం, ఇక నుంచి తమిళ జాలర్లు నిబంధనలు పాటిస్తారని ఒప్పంద పత్రాలు ఇచ్చారు కూడా. అవి అమలుకు కావడంలేదు. నిత్యం తమిళ జాలర్లు ఆగడాలు పెరుగుతూనే ఉన్నాయి.



బుల్లి మర బోటుతో వేటకు సమాయత్తం అవుతున్న మత్స్యకారులు

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ ఆనంద్



ప్రజలతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

విడవలూరు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆనంద్ తెలిపారు. విడవలూరులో శనివారం కలెక్టర్ పర్యటించారు. ఆయన మండలంలో పారిశుద్ధ్య కార్యక్రమాలను పంచాయతీ, వైద్యారోగ్యశాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం డయేరియా, సీజనల్ వ్యాధుల నిర్మూలనకు చేపట్టిన కార్యక్రమాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. చెత్త తొలగింపు, దోమలు ప్రబలకుండా చేపట్టిన కార్యక్రమాలను పంచాయతీ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ శ్రీనివాసరావు, వీఆర్వో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు ఉదయ్, హరిప్రసాద్, డాక్టర్లు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆర్టీసీ పార్శిల్స్ వేలం

నెల్లూరు సిటీ: ఏపీఎస్‌ఆర్టీసీ నెల్లూరు పార్శిల్ విభాగంలో 22వ తేదీన ఉదయం 10.30 గంటలకు ప్రధాన ఆర్టీసీ బస్టాండ్‌లో బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు ఆర్టీసీ కార్గో మేనేజర్ దివ్యకామాక్షి శనివారం ప్రకటనలో తెలిపారు. పార్శిల్ విభాగంలో అన్ క్లైమ్డ్, అన్‌ఐడెంటీఫై పార్శిల్స్‌ను బహిరంగ వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు బహిరంగ వేలానికి హాజరుకావాని కోరారు.

సెప్టెంబర్ 28, 29 తేదీల్లో టైప్ రైటింగ్ పరీక్షలు

నెల్లూరు (టౌన్): స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెనింగ్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షలు సెప్టెంబర్ 28, 29 తేదీల్లో నెల్లూరులోని మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించనున్నట్లు జిల్లా టైప్ ఇన్‌స్టిట్యూట్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, జోనల్ కార్యదర్శి రమేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు తెలుగు, ఇంగ్లిష్‌లో లోయర్, హయ్యర్ గ్రేడ్‌ల్లో ఇంగ్లిష్ హైస్పీడ్, ఇంగ్లిష్ జూనియర్ గ్రేడ్‌ల్లో నిర్వహిస్తారన్నారు. షార్ట్ హ్యాండ్ పరీక్షలు సెప్టెంబర్ 21, 22 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోపు స్థానిక టైప్ ఇన్‌స్టిట్యూట్స్‌లో సంప్రదించాలన్నారు.


జొన్నవాడ దేవస్థానంలో విచారణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో మూడురోజులుగా అధికారులు విచారణ చేపడుతున్నారు. గడిచిన ఐదేళ్లుగా జరిగిన లావాదేవీలు, అకౌంట్స్ తదితర విషయాలపై రికార్డులు పరిశీలించారు. నెల్లూరు, గుంటూరు, ఒంగోలుకు చెందిన దేవదాయశాఖ అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. అయితే ఈ విషయమై మీడియాకు ఎలాంటి సమాచారం అందించలేదు. వివరాలను గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఫోర్జరీ కేసులో విచారణ షురూ

నెల్లూరు(క్రైమ్): నగరపాలక సంస్థ కమిషనర్ల సంతకాల ఫోర్జరీ కేసులో దర్గామిట్ట పోలీసులు విచారణ చేపట్టారు. నగరపాలక సంస్థ కమిషనర్లుగా పనిచేసిన డి.హరిత, వికాస్‌మర్మత్ సంతకాలను కొందరు ఫోర్జరీ చేసి అక్రమాలకు పాల్పడ్డారు. ఈ వ్యవహారంలో భారీగా నగదు చేతులు మారాయి. కమిషనర్ వికాస్ మర్మత్ ఫిర్యాదు మేరకు దర్గామిట్ట పోలీసులు శుక్రవారం రాత్రి టీపీఓలు ప్రవీణ్‌కుమార్, దేవేంద్ర, వార్డ్ ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు నాగేంద్రబాబు, కార్తీక్ మాలవ్య, స్ట్రక్చరల్ ఇంజినీర్ అండ్ లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్ దిలీప్‌కుమార్, నగర మేయర్ భర్త పి.జయవర్ధన్, ఆయన అసిస్టెంట్ శివకృష్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగరపాలక కమిషనర్‌గా సూర్యతేజ



నెల్లూరు (బారకాసు): నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్‌గా మల్లవరపు సూర్యతేజను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ఏలూరు జిల్లా కేఆర్‌పురం ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్‌గా నియమితులయ్యారు. 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సూర్యతేజ అనంతపురం అసిస్టెంట్ కలెక్టర్, నరసాపురం సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు.

అవినీతిలో సోమిరెడ్డికి మొదటి ర్యాంకు

- కక్షలతో పాటు 'క్యాష్' సాధింపుల్లో కూడా అగ్రగామి
- 40 రోజుల్లో అన్ని వర్గాలను పిండేశారు
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

నెల్లూరు సిటీ: అవినీతిలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా నిలుస్తారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. గడిచిన 40 రోజుల్లోనే అన్ని వర్గాలను పిండేశారన్నారు. నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం కాకాణి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్రమ లేఅవుట్లపై సోమిరెడ్డి గంభీర ఉపన్యాసాలు గబ్బు కొడుతున్నాయన్నారు. పొదలకూరులో ఎవరి హయాంలో అక్రమ లేఅవుట్లు పుట్టగొడుగుల్లా పుట్టుకు వచ్చాయో తేదీలతో సహా చెప్పుంటే బాగుండేదన్నారు. 2014–19 మధ్య సోమిరెడ్డి మంత్రిగా ఉండగా పొదలకూరులో అక్రమ లేఅవుట్లు ఏర్పాటయ్యాయని, అధికారులు ఇచ్చిన నివేదికలను తాము అప్పట్లో బట్టబయలు చేశామని గుర్తుచేశారు. పొదలకూరులో లేఅవుట్ల యాజమాన్యాల వద్ద సోమిరెడ్డి మాదిరిగా తాము దోచుకోలేదన్నారు. ఆయన ఆరోపిస్తున్న లేఅవుట్ టీడీపీ హయాంలోనే వచ్చిందని, తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉండగా లేఅవుట్ల యజమానులను ఎవరినీ ఇబ్బంది పెట్టలేదన్నారు. అధికారం ఎవరికీ ఉంటే వారి లేఅవుట్లు సక్రమంగా, మిగతా వారివి కక్షతో కూల్చివేయాలనే కొత్త సంప్రదాయానికి సోమిరెడ్డి నాంది పలికాడని తెలిపారు.

కక్ష.. క్యాష్ సాధింపు

సోమిరెడ్డి కక్ష సాధింపుతో పాటు 'క్యాష్' సాధింపులో దిట్ట అని, పొదలకూరు చిన్న గ్రామ పంచాయతీ కాబట్టి, లేఅవుట్ల యజమానులు సోమిరెడ్డి డిమాండ్ చేసినంత క్యాష్ ఇవ్వలేకపోవచ్చన్నారు. తండ్రీకొడుకులు కారులో సంచులు పెట్టుకుని లేఅవుట్ల చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు. సోమిరెడ్డి అవినీతి వల్ల అధికారులు, లేఅవుట్ల యాజమాన్యాలు ఇబ్బందులు పడుతున్నారని, క్యాష్ మీద ఉన్న శ్రద్ధ పరిపాలన మీద లేదన్నారు. టీడీపీ హయాంలోనే పంచాయతీల్లో చెక్కుల్లో సంతకాలు చేసే పద్ధతి తీసేసిన విషయం సోమిరెడ్డికి తెలియదా అన్నారు. సర్పంచ్ బయోమెట్రిక్ వేస్తేనే పేమెంట్లు జరుగుతాయన్నారు. ముత్తుకూరు సర్పంచ్‌ను అడ్డుపెట్టుకుని వైఎస్సార్‌సీపీపై లేనిపోని విమర్శలు చేయిస్తున్నారన్నారు. ఏపీ జెన్కో నుంచి రవాణా చేసే ఫ్లై యాష్ బల్కర్‌కు నెలకు రూ.లక్ష చొప్పున రూ.16 లక్షల వసూలు చేస్తున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. మైనింగ్, ఇరిగేషన్ అధికారులను భయపెట్టి, 40 రోజుల్లోనే గ్రౌండ్ వాటర్‌ను దెబ్బతీసే విధంగా ఇసుకను కొల్లగొట్టేందుకు సోమిరెడ్డి ప్రయత్నాలు ప్రారంభించాడన్నారు. సోమిరెడ్డి తాను నీతిమంతుడని చెప్పాలంటే.. రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రమాణం చేయడానికి సిద్ధమా అని సవాల్ విసిరారు.

విద్యార్థిగా కలెక్టర్ ఆనంద్



ఉపాధ్యాయురాలి బోధనా పద్ధతిని విద్యార్థులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్

కొడవలూరు: కలెక్టర్ ఆనంద్ గిరిజన గురుకుల పాఠశాలలో కొద్దిసేపు విద్యార్థిగా మారారు. ఉపాధ్యాయుల బోధనా తీరు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కొడవలూరులోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ ఓ.ఆనంద్ శనివారం సందర్శించారు. 8వ తరగతి విద్యార్థులతో కలిసి తోటి విద్యార్థిలా బెంచీపై కూర్చొని ఓ విద్యార్థికి గణితంలోని ఓ లెక్క ఇచ్చి పరిష్కరించాలని సూచించారు. జిల్లా కలెక్టరే పక్కన కూర్చొని లెక్క పరిష్కరించాలని సూచించడంతో ఆ విద్యార్థి తడబడిపోయారు. తొలుత స్టోర్ గదిలో సరుకుల నాణ్యతను పరిశీలించారు. మరుగుదొడ్లు, వసతి గదులు, వంట గది, సిబ్బంది హాజరు రిజిస్టర్ తదితరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా వైద్య సేవలు అందిస్తున్నారా లేదా అడిగారు. కలెక్టర్ వెంట ఇన్‌చార్జి ఐటీడీఏ పీఓ పరిమళ, తహసీల్దారు శైలేంద్ర కుమార్, ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎస్.అంకయ్య, ప్రిన్సిపల్ పి.దేవసహాయం ఉన్నారు.

జాయింట్ కలెక్టర్ బదిలీ



నెల్లూరు (దర్గామిట్ట): జిల్లా జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్ బదిలీ అయ్యారు. శనివారం రాత్రి ప్రభుత్వం విడుదల చేసిన బదిలీల ఉత్తర్వుల్లో జేసీ సేదు మాధవన్‌ను పార్వతీపురం ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. ఈ ఏడాది మార్చి 8న జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. నాలుగు నెలల వ్యవధిలోనే బదిలీ అయ్యారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ఆయన విశేష సేవలు అందించారు.

కోర్కె తీరితే.. మళ్లీ వస్తాం

- భారీగా తరలివచ్చిన భక్తులు
- కోర్కెల రొట్టెల కోసం పోటీ
- భక్తిశ్రద్ధలతో తహలీల్ ఫాతేహా
- నేటితో ముగియనున్న రొట్టెల పండగ

బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండగకు శనివారం భారీగా భక్తులు హాజరయ్యారు. స్వర్ణాల చెరువు భక్తజన సంద్రమైంది. ఒకరికొకరు తెలియకపోయినా.. కుల, మతాలు.. భాషా భేదాల తేడా లేకుండా భక్తులు ఒకరిని ఒకరు పరిచయం చేసుకుని పుణ్యస్నానాలు ఆచరించి కోర్కెల రొట్టెలు మార్చుకున్నారు. 'మా కోర్కెలు తీర్చండి.. మళ్లీ వస్తాం' అంటూ భక్తులు ప్రగాఢ విశ్వాసంతో బారాషహీదులకు మొక్కుకున్నారు.



దర్గాలో బారాషహీదుల సమాధులను దర్శించుకుంటున్న భక్తులు

నెల్లూరు(బారకాసు): నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండగ చివరి అంకానికి చేరింది. ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభమైన పండగకు జిల్లా, రాష్ట్రం నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో పాటు నగర వాసులు కూడా తరలిరావడంతో స్వర్ణాల తీరం భక్తజనసంద్రమైంది. తమ కోర్కెలు తీరాలని వరాల రొట్టెలను పట్టుకోగా, తమ కోర్కెలు తీరాయని వదిలారు. అనంతరం భక్తులు దర్గాలోని షహీదుల సమాధులను దర్శించుకుని ప్రార్థనలు చేశారు.

భక్తిశ్రద్ధలతో తహలీల్ ఫాతేహా

రొట్టెల పండగలో భాగంగా శనివారం తహలీల్ ఫాతేహా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంప్రదాయంగా వక్ఫ్‌బోర్డు గంధాన్ని బిందెలో తీసుకొచ్చారు. ముజావర్లు, ఫకీర్లు, మత పెద్దలు ప్రత్యేక దువా చేసి తహలీల్ ఫాతేహా (చదివింపులు) నిర్వహించారు. అనంతరం పవిత్ర గంధాన్ని భక్తులకు పంచారు. బారాషహీద్ దర్గా రొట్టెల పండగ కమిటీ చైర్మన్ ఖాదర్‌బాషా మాట్లాడుతూ గురువారం అర్ధరాత్రి ప్రారంభమైన పవిత్ర గంధమహోత్సవం శనివారం తహలీల్ ఫాతేహాతో పరిసమాప్తమైందన్నారు. సంప్రదాయంగా ఆదివారం 11 గంటలకు జరిగే ఖత్ మే జియారత్ (ముగింపు)తో రొట్టెల పండగ ముగుస్తుందన్నారు. పండగ ఏర్పాట్లను కలెక్టర్ ఆనంద్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. పోలీస్ కంట్రోల్ రూంను కలెక్టర్ పరిశీలించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలని సూచించారు.

ఆరోగ్య, వివాహ రొట్టెలకు డిమాండ్

రొట్టెల పండగలో శనివారం ఆరోగ్య, వివాహ రొట్టెలకు డిమాండ్ ఏర్పడింది. అధిక మంది భక్తులు తమ కుటుంబ సభ్యులకు ఆరోగ్యం ప్రసాదించాలని కోరుతూ, అవివాహితులు తమకు పెళ్లి కావాలని కోరుకుంటూ ఆరోగ్య, వివాహ రొట్టెలను పట్టుకునేందుకు పోటీపడ్డారు.

సెల్ఫీల కోసం ప్రాణాంతక ఫీట్లు



సోమశిల: సోమశిల జలాశయం సందర్శనకు వస్తున్న పర్యాటకులు సెల్ఫీల కోసం ప్రాణాంతక ఫీట్లు చేస్తున్నారు. జలాశయం ముందు భాగంలో, ప్రాంగణంలో ఎటువంటి హెచ్చరిక బోర్డులు, భద్రతా ఏర్పాట్లు లేకపోవడం, సెక్యూరిటీ లేకపోవడంతో పర్యాటకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. డెల్టాకు నీటిని విడుదల చేసే కాలువ వద్ద ఇష్టానుసారంగా నీటిలో దిగి సెల్ఫీల కోసం ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. గతంలో ప్రమాదాలు జరిగిన సందర్భంలో అధికారులు రక్షణ చర్యలు చేపడుతామని చెప్పినా.. ఇంత వరకు వాటిని ఏర్పాటు చేయకపోవడంతో ఏదోక రోజు పెను ప్రమాదం పొంచి ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత జలాశయం అధికారులు వెంటనే స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.

టౌన్ బస్సుల్లో చార్జీల దోపిడీ

నెల్లూరు సిటీ: నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండగ నేపథ్యంలో టౌన్ బస్సుల నిర్వాహకులు చార్జీల దోపిడీకి పాల్పడుతున్నారు. దేశ నలుమూలల నుంచి రొట్టెల పండగకు లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. అయితే ఇదే అదనుగా ప్రైవేట్ బస్సు నిర్వాహకులు టికెట్ ధరలను డబుల్‌గా పెంచి ప్రయాణికుల నుంచి దోచుకుంటున్నారు. నెల్లూరు నగరంలోని కేవీఆర్ పెట్రోల్ బంకు నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు టికెట్ ధర రూ.10 ఉండేది. అయితే కేవీఆర్ పెట్రోల్ బంకు నుంచి మద్రాసు బస్టాండు, వీఆర్సీ సెంటర్, గాంధీబొమ్మ ఎక్కడ దిగినా రూ.20 లెక్కన వసూలు చేశారు. ఈ బస్సుల్లో నిత్యం తిరిగే నగర ప్రయాణికులు టికెట్ ధరల పెంపుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





కోర్కెల రొట్టెలు స్వీకరించిన భక్తులు



స్వర్ణాల ఘాట్ వద్ద జనమే జనం

రొట్టెలు స్వీకరించి..
ఆనందించి..

నెల్లూరులో జరుగుతున్న రొట్టెల పండగకు శనివారం భక్తులు వెల్లువలా తరలి వచ్చారు. దీంతో బారాషహీద్ దర్గా, స్వర్ణాల ఘాట్ సందడిగా మారాయి. విద్య, ఉద్యోగం, ఆరోగ్యం, వివాహ రొట్టెల కోసం అనేకమంది పోటీ పడ్డారు. తాము కోరుకున్నవి దక్కడంతో అనేకమంది ఆనందం వ్యక్తం చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్



ఇదిగోమ్మా వరాల రొట్టె అందుకో..



దర్గాలో భక్తులు




రొట్టెలు తీసుకుంటున్న భక్తులు

తల్లిదండ్రుల చెంతకు చిన్నారులు



కమాండ్ కంట్రోల్ నుంచి పరిస్థితిని వీక్షిస్తున్న ఎస్పీ



తప్పిపోయిన చిన్నారిని బాధిత కుటుంబానికి అప్పగిస్తున్న పోలీసులు

నెల్లూరు(క్రైమ్): బారాషహీద్ దర్గాలో జరుగుతున్న రొట్టెల పండగలో తప్పిపోయిన 51 మంది చిన్నారులను శనివారం పోలీసు అధికారులు సంరక్షించి తల్లిదండ్రుల చెంతకు చేర్చారు. ఎస్పీ జి.కృష్ణకాంత్ దర్గా, స్వర్ణాల చెరువు ఘాట్, కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలించి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తుల్లో కొందరు బ్యాగ్‌లు, ఏటీఎంలు, పర్సులు పోగొట్టుకోగా క్రైమ్ పోలీసులు వాటిని గుర్తించి బాధితులకు అందజేశారు. ఆదివారంతో పండగ ముగుస్తుంది. దీంతో ఇతర జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బంది తమ ప్రాంతాలకు వెళ్లిపోయారు. జిల్లాకు చెందిన వారు మాత్రమే బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు. ఎస్పీ వెంట నగర డీఎస్పీ డి.శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 138
లేయర్ (లైవ్) : 110
బ్రాయిలర్ చికెన్ : 246
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 274
లేయర్ చికెన్ : 187



నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.65
సన్నవి : రూ.50
పండ్లు : రూ.35



క్లుప్తంగా

తెలుగు తమ్ముళ్ల మధ్య వర్గపోరు

- మాజీ కన్వీనర్ కారు అద్దాలు ధ్వంసం

కొండాపురం: మండలంలోని కొమ్మి పంచాయతీలో టీడీపీ నాయకుల మధ్య వర్గపోరు రచ్చకెక్కింది. ఎన్నికల నుంచి బొల్లినేని, కాకర్ల వర్గాల మధ్య పోటాపోటీగా మాటల యుద్ధం జరుగుతున్న విషయం తెలిసిందే. నాయకుల మధ్య విభేదాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో టీడీపీ మాజీ కన్వీనర్ చెరుకూరి వెంకటాద్రినాయుడికి చెందిన కారు కొమ్మి – లింగన్నపాళెం రోడ్డులో నిలిపి ఉంది. తమ పార్టీ వారు కర్రలతో వాహన అద్దాలను ధ్వంసం చేశారని బొల్లినేని వర్గానికి చెందిన వెంకటాద్రినాయుడు వాపోయారు. ఒకే పార్టీలో ఉండేవారిపై కక్ష సాధింపు చర్యలకు దిగడం దారుణమన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే కాకర్ల సురేష్, పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన శనివారం వెల్లడించారు.

పక్కాగా లెప్రసీ సర్వే

- అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలీ



సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ

నెల్లూరు(అర్బన్): జిల్లాలో లెప్రసీ సర్వేను పక్కాగా నిర్వహిస్తున్నామని అడిషనల్ డీఎంహెచ్‌ఓ, జిల్లా కుష్టు నియంత్రణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ తెలిపారు. నగరంలోని ఎన్‌బీటీ కాలనీ, చంద్రమౌళినగర్, జేవీఆర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటా జరుగుతున్న లెప్రసీ సర్వేను శనివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఆ ప్రాంతాల్లోని పట్టణ ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఖాదర్‌వలీ మాట్లాడుతూ కుష్టు వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తిస్తే తగిన చికిత్స ద్వారా ప్రబలకుండా అరికట్టవచ్చన్నారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, వలంటీర్ల సర్వేను ఎలాంటి లోపాలు లేకుండా పక్కాగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణారోగ్య కేంద్రాల డాక్టర్లు రీనాభారతి, హిమదీప్తి, కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, డీపీఎంఓ డాక్టర్ బీవీ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

స్పందించిన యంత్రాంగం

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(క్రైమ్): రొట్టెల పండగ సందర్భంగా బారాషహీద్ దర్గాలో అపరిశుభ్ర వాతావరణం, ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు వేలాడుతుండడం తదితర సమస్యలపై 'అమాత్యా.. అంతా గొప్పలేనా..!' అని సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి నెల్లూరు నగరపాలక సంస్థ అధికారులు స్పందించారు. నగరపాలక సంస్థ తాగునీటి కేంద్రంలో చెరకు రసం పాయింట్‌ను పక్కకు జరిపించారు. జ్యూస్ తీయగా వచ్చిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని దుకాణదారుడిని ఆదేశించారు. మున్సిపల్ రిసెప్షన్ కౌంటర్ వద్ద విద్యుత్ వైర్లు ప్రమాదకరంగా ఉన్న చోటుకు ఎవరూ వెళ్లకుండా బారికేడ్లను ఏర్పాటు చేశారు. దర్గా ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాల వల్ల ఇబ్బందులు కలగకుండా ఎస్‌, ఏపీఎస్పీడీసీఎల్ సిబ్బందిచే ఎప్పటికప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ల లోడ్‌ను పరిశీలిస్తున్నారని తెలియజేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

- వ్యక్తి మృతి



ప్రభాకర్ మృతదేహం

నెల్లూరు సిటీ: నెల్లూరు రూరల్ మండలంలోని గుడిపల్లిపాడు నుంచి నరుకూరుకు వెళ్లే దారిలో గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని నవాబుపేటలోని పుల్లమ్మవీధిలో గడ్డం ప్రభాకర్ (49), లక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలున్నారు. ప్రభాకర్ ఆటో నడుపుతుంటాడు. లక్ష్మి టీడీపీ కార్యాలయం సమీపంలో టిఫిన్ అంగడి నిర్వహిస్తోంది. కొంతకాలంగా ప్రభాకర్ మద్యానికి బానిసయ్యాడు. మత్తులో అప్పుడప్పుడు ఇంటికి వెళ్లలేక రోడ్డుపై పడిపోతుండేవాడు. తెలిసినవారు అతడిని ఇంటికి చేర్చేవారు. శుక్రవారం ప్రభాకర్ ఇంట్లో మద్యం తాగి సాయంత్రం బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో లక్ష్మి బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి భర్త ఆచూకీ కోసం ఆరా తీసింది. అయితే తెలియరాలేదు. శనివారం ఉదయం గుడిపల్లిపాడులో ప్రభాకర్ రోడ్డు పక్కన చనిపోయి ఉండగా స్థానికులు గమనించి రూరల్ పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి శరీరంపై గాయాల ఆధారంగా గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు.

పది సవర్ల బంగారం చోరీ

కోవూరు: మండల కేంద్రంలోని గుమ్మలదిబ్బ ప్రాంతంలో శనివారం పట్టపగలు దొంగతనం జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు పది సవర్ల బంగారు ఆభరణాలు చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు.. వేనాటి సుజాత అనే మహిళ గుమ్మలదిబ్బలో నివాసం ఉంటోంది. గ్యాస్ సిలిండర్ కోసం వేలిముద్ర వేయాలని కోవూరులోని ఏజెన్సీ నిర్వాహకులు చెప్పడంతో ఆమె వెళ్లింది. ఇంతలో దొంగలు సుజాత ఇంట్లోకి చొరబడి బీరువాను పగులకొట్టి అందులోని నగలు చోరీ చేశారు. బాధితురాలు ఇంటికి వచ్చి దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. రైటర్ రషీద్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేశారు.

పోలీసుల తీరుకు నిరసనగా దీక్ష



దీక్ష చేస్తున్న స్వామి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు సమీపంలో ఉన్న మోటచింతలపాళెం ఆశ్రమంలో నెలకొన్న వివాదంలో పోలీసులు తమకు న్యాయం చేయలేదంటూ, వారి తీరుకు నిరసనగా శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న మండపం వద్ద గోపాలకృష్ణ స్వామి మౌన దీక్ష చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. వింజమూరు సమీపంలో ఉన్న మోటచింతలపాళెం వద్ద ఉన్న ఆశ్రమానికి సంబంధించి నిర్వహణ విషయమై గోపాల్‌కృష్ణ స్వామి, గోదాల పుల్లారెడ్డి, మహేంద్ర మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో స్వామి కోర్టును ఆశ్రయించగా ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చింది. ఆర్డర్ కాపీని పోలీసులు, రెవెన్యూ అధికారులకు ఇచ్చి ఆశ్రమం తనకు అప్పగించేలా చూడాలని పలుమార్లు కోరినా స్పందించలేదని, దీనికి నిరసనగా మౌన దీక్ష చేపట్టినట్లు గోపాలకృష్ణ చెప్పారు. న్యాయం జరిగే వరకు దీక్ష కొనసాగిస్తానని తెలిపారు. భక్తుల సేవ కోసం ఏర్పాటు చేసిన ఆశ్రమాన్ని కబ్జా చేసిన వ్యక్తుల నుంచి కాపాడి తనకు అప్పగించాలని కోరారు.